**అబ్బాయి సూర్యం రాసిన ఉత్తరంలో చాలా ఆసక్తికరమైన విషయమే ఉంది. ఏండ్ల తరబడి ముడి వీడని చిక్కు ప్రశ్నకు సమాధానం అది. ఈ కథకు ఆ ఉత్తరమే ముగింపు అనుకుంటే, ముందుగా కథ చెప్పాలిగా?**




✷ ✷ ✷

పదేళ్ల క్రితం మా ఇంటి కొచ్చాడు వాడు.

చిరిగి పోయిన దుస్తులు, తైలసంస్కారానికి నోచుకోని కేశాలు, నిరాశానిస్పృహలు గూడు కట్టుకున్న ముఖం, ఆవేదనా, నిస్సహాయతా ప్రకటించే కనుదోయి ... పట్టుమని పదేళ్లయినా నిండని ఎముకల గూడు.

తల్లితండ్రుల్ని పోగొట్టుకున్న నిర్భాగ్యుడు.

ఆస్తి గానీ, ఆదరించే దిక్కు గానీ లేకపోయింది. లోకంలో ఏకాకిగా మిగిలి పోయాడు. వలస పోయే పిట్టలా చిరురెక్కల్ని అల్లల్లాడించుకుంటూ ఊరు వదిలాడు. "అదిగో మీ దూరపు బంధువు, అక్కడి కెళ్లు" అన్నా రెవరో. ఆ దిక్కును పట్టుకుని మా పంచకు చేరాడు వాడు.

వాడి పేరు గోపీ.

"ఏం చదువుకున్నావ్?" అని అడిగితే, 'చదువు రాదు' అన్నాడు.

"ఇక్కడ బడికి పంపుతాం. చదువుకో. నీకు తోడుగా మా సూర్యం ఉన్నాడు. వాడితో ఆడుకో. నీ కేమీ భయం లేదు. ఇది మన ఇల్లు" అంటూ వాణ్ని బుజ్జగించాము.

గోపీ క్రమంగా తన దుఃఖాన్ని, ఒంటరితనంలోని బరువును మరిచిపోయాడు. సూర్యంతో సరదాగా ఆడుకోవడం మొద లెట్టాడు. ఎప్పుడూ కులాసాగా ఉండే వాడు. తన సొంత ఊరిలోని వింతలు, విశేషాలు కథ లల్లి సూర్యానికి చెప్పే వాడు.

వాడి ఉల్లాస మంతా బడిలో చేర్పించిన నాటి వరకే! బడిలో చేరింది మొదలు వాణ్ని నిరుత్సాహం ఆవరించింది.

ఓ రోజు బడిలో మేష్టారు ఆవూ - పులీ కథ చెబుతుంటే, కళ్ల వెంబడి నీళ్లు కారుస్తూ కదలకుండా కూర్చున్నాడట! సూర్యం చెప్పాడు. అది విన్నాక వాడి పట్ల మాకున్న జాలీ, శ్రద్ధా మరింత పెరిగాయి.

గోపీ బడికి వెళ్లక రోజూ ఊరి బయట చెరువు గట్టు మీదనో, మామిడి తోపుల్లోనో గడిపి, బడి విడిచే వేళకు ఇంటికి వస్తున్నాడని తెలిసింది.

చాలా సార్లు మందలించాము. చివరికి ఓ రోజు చేయి చేసుకోక తప్ప లేదు. అంతే! ఆ ఒక్క దెబ్బకే వాడు మాయమై పోయాడు.

సొంత ఊళ్లో చిలకలా ఉండే గోపీకి ఇక్కడి జీవితం పంజరంగా తోచిందేమో!

పొరుగూళ్లల్లో ఉన్న ఒక రిద్దరు చుట్టాల ఇళ్లలో కూడా ఇలాగే కొన్నాళ్లు గడిపి పారిపోయాడని వాళ్లు చెప్పగా తెలిసింది.

పక్షులు స్వేచ్ఛాజీవులు. ఆనందం ఎంతో అపాయం అంతే వాటికి. పంజరాలలో రక్షణ ఉండీ, సకల సదుపాయాలూ అమరినా, అవి స్వేచ్ఛను, ప్రమాదాన్నీ మాత్రమే కోరుకుంటాయి, ఎందుకో? అవి అలా ఉండి పోతే బావుండును - మన జీవితాలలో అడుగు పెట్టకుండా ... అనిపించింది ఆ క్షణంలో.

ఆ నాటి నుంచి ఈ పది సంవత్సరాల కాలంలో మళ్లీ మా మూలంగా వాడి స్వేచ్ఛకు ఆటంకం కలగలేదు.

సూర్యం మాకు గర్వకారకు డయ్యాడు. తిరుపతిలో హాస్టల్‌లో ఉంటూ, యూనివర్సిటీలో చదువుకుంటున్నాడు. వాడు రాసే ఉత్తరాలన్నీ సాధారణంగా తన చదువుసంధ్యల్ని గురించీ, ఫీజుల్ని గురించీ అయితే, ఈ సారి రాసిన ఉత్తరం మాత్రం పూర్తిగా గోపిని గురించే!

✷ ✷ ✷

"గోపీ ఇక్కడే - తిరుపతిలో ఉంటున్నాడు. నన్ను గుర్తు పట్టాడు కూడా. మిమ్మల్ని గురించీ అడిగాడు. వా డిప్పు డెంతో తృప్తిగా ఉంటున్నాడని! ఊరి అంచున తిరుచానూరి వైపు ఓ పాకలో ఉంటున్నాడు. ఎలా సంపాదించాడో గానీ, రెండు గేదెల్ని పెంచుకుంటున్నాడు. రెండూ పాలిస్తున్నాయి. ఆ పాడి అమ్ముకుని పొట్ట పోసుకుంటున్నాడు ...

"వాడు ఏదోలా బతుకుతున్నా డన్నది ముఖ్య విషయం కాదు గానీ, వాడు స్వయంగా పాలు పితికి, లేగల్ని పొదుగు దగ్గిర వొదిలి, వాటి వైపే చూస్తూ నులక మంచం మీద కూర్చుంటాడు. అప్పుడు చూడాలి వాడి ముఖం! ఆ దృశ్యాన్ని ఏ కవి వర్ణించగలడు? ఆ కళ్లలో అమృతభాండమే ఉందో, పాల సముద్రమే ఉందో ఏ మనస్తత్వశాస్త్రజ్ఞుడు చెప్ప గలడు? ...

'ఇంకో విషయం - గోపీ ఇప్పుడు రాత్రి బళ్లో శ్రద్ధగా చదువుకుంటున్నాడు'

✷ ✷ ✷

తను పోగొట్టుకున్న స్వర్గాన్ని జీవితంలో ఇలా పునః ప్రతిష్ఠించుకున్న గోపీ పట్ల జాలి కలిగింది నాకు.